క్లుప్తంగా

ప్రశాంతంగా నీట్ పరీక్ష



పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

షాద్‌నగర్: వైద్య విద్య కోర్సుల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్)ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మొత్తం 792 మంది విద్యార్థులకు గాను 778 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. మిగిలిన 14 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని సెంటర్ నిర్వాహకులు రవిప్రకాష్ హర్యాక్ తెలిపారు.

కుంగ్‌ఫూ విద్యార్థులకు ఫిజికల్ టెస్టులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్‌లో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులకు ఆదివారం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా రావిర్యాల, ఆగిర్యాల పీర్జాపూర్, కాస్లాబాద్ తదితర గ్రామాలకు చెందిన 49 మంది విద్యార్థులు టెస్టులకు హాజరైనట్లు మాస్టర్ రాజు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేశ్, మాస్టర్ రాజు, సురేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చేవెళ్ల: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పామెనలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ వనస్థలిపురం వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పామెన మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, బాబు, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, కృష్ణయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన లింగమ్మ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కోరగా స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ.1లక్ష 50వేలు ఎల్‌ఓసీ పత్రాన్ని మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వంట సామగ్రి అందజేత



సరుకులు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: నిరుపేద యువతి పెళ్లికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వంట సామగ్రి అందజేశారు. మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన ఇర్కుల రాములు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమయ్య, కరుణాకర్‌రెడ్డి, రాఘవేందర్, కరుణవెంకట్‌రెడ్డి, చంద్రయ్య, చంద్రయ్య, శేఖర్, మల్లేష్, నర్సింలు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్లకు అతుకులెన్నడో?



ధ్వంసమైన మున్సిపాలిటీ ప్రధాన కార్యాలయం రోడ్డు

- భగీరథ పైపులైన్ల కోసం తవ్వకాలు
- గుంతలమయంగా మారిన రోడ్లు

కొత్తూరు: మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైపులైన్ల ఏర్పాటుకు రోడ్లను తవ్వడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నేటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మరమ్మతులు సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టాలా..? మున్సిపాలిటీ చేపడుతుందా..? అనే విషయం తెలియక అయోమయంలో ఉన్నారు. ఈ పథకంలో భాగంగా మున్సిపాలిటీలోని 12వార్డులో గత మూడేళ్ల క్రితం కొత్తగా పైపులైన్లు వేశారు. ఇందుకు కాంట్రాక్టర్లు ప్రధాన, అంతర్గత రోడ్లను జేసీబీలతో తవ్వి పనులు పూర్తి చేశారు. మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు.

మున్సిపాలిటీ వివరాలు..

మున్సిపాలిటీలో 23 కిలోమీటర్ల సీసీరోడ్లు, 14 కిలోమీటర్ల బీటీ, 5 కిలోమీటర్ల కచ్చారోడ్లు ఉన్నాయి. కొత్త పైపులైన్ల ఏర్పాటుతో దాదాపుగా అన్ని రోడ్లు ధ్వంసమైయ్యాయి. కాగా, మున్సిపాలిటీ పరిధిలో 25 వేల జనాభా, 6 వేల కుటుంబాలు, 8,136 మంది ఓటర్లు ఉన్నారు. ప్రజలకు 21 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 5860 కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

గుంతలమయంగా రోడ్లు

పైపులైన్ల ఏర్పాటు కోసం సీసీరోడ్లను తవ్వి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకల సమయాల్లో విపరీతమైన దుమ్ము వెలువడుతుందని పలు వార్డుల ప్రజలు వాపోతున్నారు. కొన్ని చోట్ల ప్రజలే సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతులు చేసుకున్నారు. మరికొన్ని చోట్ల గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు



మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో పెద్దమొత్తంలో నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించడం జరిగింది. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కాగా, మిషన్‌భగీరథలో భాగంగా తవ్వకాల్లో ధ్వంసమైన రోడ్లకు కూడా మరమ్మతులు చేపడతాం.

–లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించం



నిరవధిక సమ్మెలో కూర్చున్న జేపీఎస్, ఓపీఎస్‌లు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను విరమించేది లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేశారు. నిరవధిక సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల నిరంతర శ్రమతోనే పల్లెలకు జాతీయ స్థాయి అవార్డులు దక్కాయన్నారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను తీసుకునే సమయంలోనే ప్రభుత్వం రెగ్యులరైజ్ హామీ ఇవ్వడం జరిగిందని చెప్పారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ సెక్రటరీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్, శ్రీరాం ,యాదయ్య, స్వప్నరెడ్డి, శ్రీలత, శ్వేత, ప్రవళిక, అనిల్, ప్రమోద్, రాజేందర్, పాండురంగారెడ్డి, జగదీష్, వెంకటేష్, ఫయాజ్, అశోక్, యాదయ్య, వినోద్, మురళి పాల్గొన్నారు.

ఘనంగా నాటకం



నాటకం ప్రదర్శిస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని చందిప్ప గ్రామంలో గత రెండు రోజులుగా కనకదుర్గ బాగోతం (నాటకం)ఎంతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు నాట్య ప్రదర్శన, వేషాధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రదర్శ కార్యక్రమం చూసేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాగోతంలో కనకదుర్గ అమ్మవారి చరిత్రను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అధితిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ దైవభక్తిని కలిగి ఉండాలని కోరారు. నిత్య జీవితంలో దైవారాధనకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

పండుగలతో బంధుత్వాల పటిష్టం

సర్పంచ్ రాజు



బోనాల ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

షాబాద్: పండుగలతో సంబంధాలు, బంధుత్వాలు పెంపొందుతాయని అప్పాజిగూడ సర్పంచ్ రాజు పేర్కొన్నారు. ఆదివారం అప్పాజిగూడలో బీరప్ప ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి బీరప్ప దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయంగా బోనాల పండుగను అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అలరించాయి.

వైభవంగా బీరప్ప బోనాలు



వీర్లపల్లిలో బోనాలను ఊరేగిస్తున్న కురుమలు

నందిగామ: మండలంలోని వీర్లపల్లిలో బీరప్ప స్వామి బోనాలను కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిపారు. బీరప్పస్వామి పండగ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలను ఊరేగించారు. కళాకారుల డోలు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సోమవారం బీరప్ప కామరాతి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

‘కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారు’

మాజీ ఎమ్మెల్యే రాములు



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

తుర్కయంజాల్: కేంద్రంలోని మోడీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు అన్నారు. సీపీఐ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు చేపట్టిన ‘మోడీ కో హటావో దేశ్ కో బచావో’ కార్యక్రమం ముగింపు సభకు రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు 100 శాతానికి పైగా పెరిగాయని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ దోచిపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యాదయ్య, సీపీఐ పార్టీ జిల్లా నాయకుడు అలీమొద్దీన్, సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు కిషన్, సీపీఐ నాయకులు యాదయ్య, రాజునాయక్, శ్రీనునాయక్, కాటంరాజు, భాస్కర్, శేఖర్ రెడ్డి, సుందరమ్మ, కృష్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సహకరించండి

మిల్లర్లతో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ సమీక్ష

ఆమనగల్లు: వరిధాన్యం కొనుగోలుకు రైస్‌మిల్లర్లు సహకరించాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం ధాన్యం సేకరణకు ఎంపిక చేసిన రైస్ మిల్లర్లతో చైర్మన్ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వరిధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు చేయలేమని రైస్‌మిల్లర్లు అన్నారు. ప్రభుత్వానికి తాము క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంటుందని ప్రస్తుతం వస్తున్న వడ్లలో క్వింటాల్‌కు 60 కిలోల బియ్యం కూడా రావడం లేదని దీనివల్ల తాము నష్టపోతామని రైస్‌మిల్లర్లు వివరించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయి మిల్లర్లకు అన్యాయం జరగకుండా చూస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, సీఈఓ దేవేందర్, మిల్లర్లు కరుణాకర్, విష్ణు, యాదయ్య పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం వాలీబాల్ కిట్లను ఆయన అందజేశారు. త్వరలో కడ్తాల్ పట్టణంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, క్రీడాకారులు అనిల్‌గౌడ్, మల్లేశ్, నరేశ్, మురళీ, యాదగిరి, రవి, కుమార్, సంజయ్, సిద్ధూ, కుమార్ తదితరులు ఉన్నారు.

ఆనవాయితీగా గ్రామ దేవతల ఉత్సవాలు



షాద్‌నగర్: పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపూర్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్‌కుమార్‌రెడ్డి, వ్యాపారవేత్త సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి, బాలరాజుగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, చంద్రారెడ్డి, చంద్రబాబు, వీరేందర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

కొందుర్గు: ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలాచారి అన్నారు. మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలాచారి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆధ్యా త్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. పూర్ణహుతి కార్యక్రమం అనంతరం మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



చేవెళ్ల: ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన చేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లిలో ఆదివారం మల్లిఖార్జున స్వామి భ్రమరాంభిక అమ్మప్రసన్న, భ్రమరాంభిక కేతమ్మ దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి స్వామి వారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ఆటలు ప్రతీ ఒక్కరిని ఆకట్టుకున్నాయి. ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, సర్పంచ్ అనుష, పలు పార్టీల నేతలు, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే , ఇక్కరెడ్డిగూడలో భ్రమరాంభిక మల్లికార్జున స్వామి నూతన ఆలయం నిర్మించి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

‘తెలంగాణ భరోసా సభ’ కు నాయకులు



బహిరంగ సభకు తరలివెళ్తున్న బీఎస్పీ నేతలు

కేశంపేట: హైదరాబాద్‌లో బీఎస్పీ నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభకు బీఎస్పీ మండల అధ్యక్షుడు హరికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండలం, వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి భీమయ్య, నగేశ్, శ్రీనివాస్, జగన్, చంద్రయ్య, మల్లేష్, శేఖర్, రియాజ్, బాలమణి పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్: బీఎస్పీ భరోసా సభకు ఆదివారం బీఎస్పీ తాలుకా అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో అగ్ర వర్ణాల నాయకులు అధికారాన్ని చేజిక్కించుకొని పేదల బతుకులతో ఆటలాడుకుంటున్నారని దుయ్యబట్టారు. బీజేపీ , కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నాయని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో బడుగులకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బహుజన రాజ్యాధికారంతోనే బడుగు బలహీన వర్గాల ప్రజల కష్టాలు దూరమవుతాయని అన్నారు. సభకు తరలిన వారిలో నాయకులు రాంప్రసాద్‌గౌడ్, నర్సింలు, ప్రశాంత్, భీమయ్య, మోజెస్, కుమార్, హరికుమార్, అనంతయ్య, రవి, దుర్గనిశ్రీనివాస్, విష్ణు, కృష్ణ తదితరులు ఉన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. కరోనా వైరస్‌తో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి మణికంఠ కుటుంబానికి ఆదివారం ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మణికంఠ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ..... పంచాయతీ కార్యదర్శిగా మణికంఠ మండలానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఉద్యోగం పట్ల నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే వారని గుర్తు చేశారు. తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం హర్షణీయమన్నారు. అనంతరం మణికంఠ తల్లి పద్మమ్మకు రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, ఎంపీఓ కల్యాణి, శారద, సర్పంచ్‌లు శ్రీనివాస్ యాదవ్, ముబీన్‌గోరి, ఎంపీటీసీ భీష్వరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు రవీందర్, శ్రీరాం, యాదయ్య, స్వప్నరెడ్డి, శ్రీలత, అనిల్, ప్రమోద్, పాండురంగారెడ్డి, రాజేందర్, జగదీశ్, వెంకటేష్, ఫయాజ్, అశోక్, యాదయ్య, వినోద్, మురళి పాల్గొన్నారు.

మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టండి



ప్రమాదకరంగా మూలమలుపు

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల మూల మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరిగి వాహనదారులు తీవ్రంగా గాయాలపాలవు తున్నారు. ప్రమాదకర మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో పెంజర్ల జెడ్పీహెచ్ఎస్ ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదం జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



విద్యార్థులతో మాట్లాడుతున్న రాము

ఆమనగల్లు: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఆమనగల్లుతో పాటు పలు మండలాల్లో శృతిలయ కల్చరల్ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.సంగీతం,నృత్యం, చిత్రలేఖనంలాంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారు. అకాడమీ సలహాదారుడు తిరుపతిగౌడ్, అభినవరెడ్డి, నాగార్జున, మల్లేశ్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆదివారం మేడే వారోత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ ఎంపీటీసీ తావునాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో జెండావిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రైతాంగం, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలానే కొనసాగితే ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు. నాయకులు..చందునాయక్, పాపయ్యగౌడ్, నరేందర్, వెంకటయ్య, నర్సింహ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.